# చనిపోయిన వ్యక్తికి టీవీ బిల్లు?



తప్పుడు బిల్లులు పంపడం, ఒకరి బిల్లులు మరొకరికి పంపడంలాంటివి సర్వసాధారణంగా జరుగుతుంటాయి. మరికొందరు ఇంకొక అడుగు ముందుకేసి వాడని కరెంటుకు, టెలిఫోన్‌లకు బిల్లులు పంపుతుంటారు. ఇవన్నీ మన చుట్టూ జరిగే, జరుగుతున్న పొరపాట్లు. కేవలం మన దగ్గర మాత్రమే ఇలాంటి పొరపాట్లు జరుగుతాయని విదేశాలలో ఇలాంటివి అస్సలు జరగనే జరగవని కొందరి ప్రగాఢ విశ్వాసం. ఇలాంటి తప్పులకు విదేశాలలో కూడా ఎలాంటి మినహాయింపు లేదని ఇటీవల జరిగిన ఓ సంఘటన రుజువు చేసింది.

ఇప్పటి వరకూ సజీవంగా ఉన్న మనుషులకి మాత్రమే తప్పుడు బిల్లులు పంపడం జరుగుతూ వస్తోంది. కానీ జర్మన్‌లో మాత్రం చనిపోయిన ఓ ప్రముఖ వ్యక్తికి టెలివిజన్ లైసెన్స్ బిల్లు పంపిన ఘనత అక్కడి అధికారులకే దక్కింది. ఈ సంఘటన వివరాలు...

జర్మనీకి చెందిన ప్రముఖ మేథమెటీషియన్ ఒకరు 450 సంవత్సరాల క్రితం చనిపోయాడు. ఆ వ్యక్తి పేరు కూడా ఇప్పటి వారికి గుర్తే లేదు. అలాంటిది జీఇజెడ్ బ్రాడ్ కాస్ట్ ఫీ కలెక్షన్ ఆఫీసు వారు ఆ వ్యక్తి పేరును గుర్తుపెట్టుకొని మరీ ఆయన పేరు మీద బిల్లు చెల్లించమంటూ తాఖీదు జారీ చేశారు. అది కూడా ఆ వ్యక్తి ఇంటి అడ్రస్‌కే కరెక్ట్‌గా పంపించారు. అయితే ఆ మేథమెటీషియన్ చనిపోగానే ఆ ఇంటిని ఓ సామాజిక సేవా సంస్థకి ఇచ్చేశారు. ప్రస్తుతం ఆ సంస్థకి ఆ టెలివిజన్ లైసెన్స్ బిల్లు అందింది. ఇంతకీ ఆ ఇంటిని ఆ మేథమెటీషియన్ 1525లో కొనుగోలు చేశాడట.

## 'సరసి' కథ

వైశంపాయనుడికి మొదట్నించీ కష్టపడకుండా సుఖపడాలని కోరికా తాపత్రయమూనూ. క్రితం సారి పంచాంగంలో ఆదాయం తక్కువ, అవమానం ఎక్కువ ఉండబట్టే తాను ఇబ్బందులు పడ్డాననీ, ఈసారి అలా జరక్కుండా ముందే జాగర్త పడాలనీ అనుకున్నాడతడు.

పంచాంగం రాసే శాస్త్రి గారు తనకి బాగా తెలుసు. ఆయన్ని కాకాపట్టి, వచ్చే సంవత్సరం పంచాంగంలో తన రాశికి ఆదాయమూ, రాజపూజ్యమూ ఎక్కువ వేయించేసుకుంటే తనకింక తిరుగుండదని అనుకొని ఓ హస్తం అరటిపళ్లు కొనుక్కెళ్లి ఆయనకి సమర్పించి తన కోరిక బయట పెట్టాడు. ''గ్రహస్థితిని తప్పించడం బ్రహ్మతరం కాదు. ముందు బయటకి నడు!'' అంటూ పిచ్చ తిట్లు తిట్టి తలుపు గెడేసేశారు శాస్త్రిగారు.

# రాశిఫలం




''వెళ్లవయ్యా, నువ్వు కాకపోతే నాకింక మార్గాలే లేవా'' అని అనుకుని, ఆ పంచాంగం ప్రింట్ అయ్యే ప్రెస్సులో తెలిసున్న వాడినొకడిని పట్టుకుని, వృశ్చికరాశికి ఆదాయం 75, వ్యయం 3, రాజపూజ్యం 50, అవమానం 2గా మార్చెయ్యమని, వాడి చేతిలో ఐదు వందలు పెట్టేడు వైశంపాయనుడు.

తన నిర్వాకం భార్య సుబ్బాయమ్మకి తెలిస్తే ఎక్కడ తిడుతుందోనని ఆమెకు కూడా చెప్పలేదు వైశంపాయనుడు. ఉగాది నాడు పంచాంగం కొని భార్యకిచ్చి, ఏమీ ఎరగని వాడిలా ''నా రాశి ఫలాలు కాస్త చూసి చెప్పవే'' అన్నాడు.

''ఆదాయం 3, వ్యయం 37; రాజపూజ్యం సున్న, అవమానం 66'' అంటూ చదివిందామె. ''సరిగ్గా చూడు వృశ్చికరాశి'' అన్నాడు వైశంపాయనుడు స్టైల్‌గా. ''మతి గానీ పోతోందా? మీది వృశ్చికరాశి ఎందుకవుతుందీ, వృషభరాశి!! అదే చదివేనిప్పుడు.'' అంది సుబ్బాయమ్మ గారు తాపీగా.

✤